క్లుప్తంగా

చెరువుల సందర్శన

పాలకొండ రూరల్: మండలంలో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న సాగు, తాగునీటి వనరుల అభివృద్ధి పనులను ఎంపీడీఓ డొంక త్రినాథులు సోమవారం పరిశీలించారు. తంపటాపల్లి, తుమరాడ, చింతాడ, అట్టలి తదితర గ్రామాల్లోని అమృత సరోవర్ పేరిట అభివృద్ధి చేసిన చెరువుల తాజా స్థితిగతులపై ఆరా తీశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధి, సచివాలయ సిబ్బందికి సూచించారు.

రైతులకు అన్ని విధాలా అండగా ఉంటాం

పాలకొండ రూరల్: ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా సేద్యానికి సన్నద్ధం కావాలని వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని తుమరాడ ఆర్‌బీకేని సోమవారం సందర్శించి అక్కడి రైతులతో సమావేశమయ్యారు. రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది అన్ని విధాలా అండగా ఉంటారన్నారు. రాయితీపై రైతులకు పంపిణీ చేసేందుకు విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో సిద్ధం చేసినట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామంలో విజయదుర్గా, మల్లేశ్వర, సుబ్రహ్మణ్య స్వామివారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, విశాఖపట్నానికి చెందిన న్యాయమూర్తి లోలుగు అప్పారావు, ఏపీపీలు కిమిడి సూర్యకుమార్, చంద్రకుమార్‌తో పాటు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

చేతివృత్తులకు తోడ్పాటు అందించండి



వినతిపత్రం ఇస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

వీరఘట్టం: పంచవృత్తుల సంఘంలో ఉన్న విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జిల్లాలోని పలువురు విశ్వబ్రాహ్మణులు సోమవారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరాడ లక్ష్మీనారాయణ ఆచారికి వినతిపత్రం అందజేశారు. బంగారం పనిచేసేవారు, కార్పెంటర్లు, వడ్రంగులు, ఇత్తడి పనిచేసేవారు ఇలా పలు రకాలు చేతివృత్తులతో కుటుంబాలను పోషించుకుంటున్న విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని స్టేట్ డైరెక్టర్ లక్ష్మీకాంతం వారికి హామీ ఇచ్చారు.


అందరి సహకారంతోనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జనచేతన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బి.శశిభూషణ చౌదరి అన్నారు. అంతర్జాతీయ బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల సంరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై హెచ్‌ఎం రేణుకాదేవి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనికి కాకుండా బడికి పంపించాలని, ఉన్నత చదువులు చదివించాలని కోరారు. అంతకుముందు వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు.

భూములు అప్పగించాలని వినతి



భూములు అప్పగించాలని కోరుతున్న గ్రామస్తులు

వీరఘట్టం: గతంలో ప్రభుత్వం తమకు కేటాయించిన భూములను అప్పగించాలని సంత-నర్సిపురం గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2008లో అప్పటి ప్రభుత్వం తమకు ఒక్కొక్కరికీ ఎకరం చొప్పున 151 ఎకరాల భూమికి కేటాయించిందని, భూమి పట్టాలను ఇచ్చారు కానీ ఇంతవరకు భూములు ఎక్కడున్నాయో చూపలేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమకు కేటాయించిన భూములను అప్పగించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ చందక సత్యనారాయణ స్పందిస్తూ రెండు నెలల్లో సర్వే చేపట్టి భూములను అప్పగిస్తామని హామీ ఇచ్చారు.



వీరఘట్టం: స్థానిక ఉన్నత పాఠశాలలో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి



భామిని: ఏపీ మోడల్ స్కూల్‌లో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ ధర్మారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం



సీతంపేట: బాలుర పాఠశాలలో జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కళావతి

విద్యార్థులకు జగనన్న కానుక

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుకల పంపిణీ కార్యక్రమం పండగలా జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేశారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేస్తూ పిల్లల చదువులకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్, పాలకొండ/కురుపాం



పాలకొండ: ఆర్‌సీఎం పాఠశాలలో జేవీకే కిట్ల పంపిణీ



జియ్యమ్మవలస: చినమేరంగి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జగనన్న విద్యాకానుకలు పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పాలకొండ రూరల్: ఎం.సింగుపురం ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమాదేవి, ఉపాధ్యాయులు



కురుపాం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని దశుమంతపురం గ్రామంలో సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నవరత్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హతే కొలమానంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారితకు ప్రాధాన్యతనిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15వేలు ఆర్థిక సాయంతో పాటు జగనన్న విద్యాకానుకల పేరిట 3 జతల యూనిఫాం, స్కూల్ బ్యాగు, షూ, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, తదితర ఎనిమిది రకాల వస్తువులు అందజేస్తున్నట్లు చెప్పారు. అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, బ్యాంకు లింకేజీ రుణాలు.. విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన.. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైఎస్సార్ పింఛన్ కానుక.. ఇలా అన్ని వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, హరిబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పెద్దూరులో..

మండలంలోని పెద్దూరు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్ తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు అందరూ విధిగా పాల్గొనాలని కోరారు.

చురుగ్గా సమగ్ర భూసర్వే



సర్వే రికార్డులు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో సమగ్ర భూసర్వే కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని తహసిల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. వీరఘట్టం రహదారిలో సర్వే నంబర్ 76 నుంచి 93 మధ్య గల భూముల్లో సోమవారం రీసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సచివాలయాల వారీగా సర్వే జరుగుతోందని, ఇందుకు సంబంధించి భూ యజమానులు, రైతులకు ముందుగా సమాచారం అందిస్తున్నామని అన్నారు. రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లతో సర్వే సిబ్బందిని సంప్రదించి, దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ బి.బుచ్చయ్య, సర్వే మొబైల్ డీటీ పి.సన్యాసిరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, సిబ్బంది ఉన్నారు.

ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ



గరుగుబిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన చేస్తున్నామని, తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని గరుగుబిల్లి, పెదగుడబ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి కోరారు. జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా పెదగుడబ, గరుగుబిల్లి, తదతర గ్రామాల్లో సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూర్వ ప్రాథమిక విద్యా బోధనపై మరింత అవగాహన కల్పించేందుకు జనభాగీదారి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి, గర్బాపు గౌరమ్మ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



రాజ్యలక్ష్మీపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కంబవలస పంచాయతీ రాజ్యలక్ష్మీపురం గ్రామంలో వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ అయిందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బావుజీనాయుడు, ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, కన్వీనర్ డి.జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు, సివిని, కొమరాడ పీఏసీఎస్ చైర్మన్లు పప్పల గోపాలకృష్ణ, మరడాన సూరపునాయుడు, సర్పంచ్‌లు అంబటి వెంకటలక్ష్మి, దత్తి మురళీకృష్ణ, కోలక తిరుపతిరావు, పార్టీ నాయకులు డాక్టర్ శెట్టి మధుసూదనరావు, కెంగువ పోలినాయుడు, సచివాలయ కన్వీనర్లు ఎస్.స్వర్ణప్రియ, కొల్లు సింహాచలం, తోరిక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి



ఆర్డీఓ హేమలతకు వినతిప్రతం అందజేస్తున్న కొమరాడ గ్రామస్తులు

కొమరాడ: మండల కేంద్రం కొమరాడ నుంచి సర్వపాడు వైపు వెళ్లే రహదారికి ఆనుకుని అక్రమంగా చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కొమరాడ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు పార్వతీపురం ఆర్డీఓ కె.హేమలత, తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల జంక్షన్ నుంచి చినఖేర్జిల వైపు వెళ్లే రహదారిలో సర్వే నంబరు 177లో గుమడ పంచాయతీ సీతామాంబపురం గ్రామనికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. దీనిపై రెవెన్యూ అధికారులు పరిశీలన చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొమరాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మరడాన సూరపునాయుడు, మాజీ జెడ్పీ చైర్మన్ గులిపిల్లి సుదర్శనరావు, నాయకులు సిరికి సింహాచలం, మరడాన సింహాచలంనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొడ్డగూడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

భామిని: మండలంలోని బొడ్డగూడ గిరిజన గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.ఫణికుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించారు. పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పలువురు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

దోమల నివారణకు చర్యలు

భామిని: వ్యాధుల వ్యాప్తికి కారణమైన దోమల నివారణకు ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టారు. భామిని కేజీబీవీ, ట్రైబర్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ఆవరణంలో సోమవారం దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. వైద్యాధికారి ఎన్.ఫణికుమార్, సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, ప్రత్యేకాధికారి బి.శారద, వార్డెన్ బి.రవికుమార్ పనులను పర్యవేక్షించారు.

113 మందికి కంటి పరీక్షలు

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సమితిలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. బద్దుమాసింగికి చెందిన ప్రగతి సేవా సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. 113 మందికి కంటి పరీక్షలు చేయగా.. వారిలో 52 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరికి విశాఖపట్నంలోని ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు హరిబాబు తెలిపారు.

విద్యార్థుల హాజరు శాతం పెంపుపై దృష్టి

- డీఈఓ ప్రేమ్‌కుమార్



విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతంను పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. 234 మంది విద్యార్థులకు గాను తొలిరోజు కేవలం 14 మంది మాత్రమే హాజరుకావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాం ఎందుకు నిర్వహించలేదని హెచ్‌ఎం బి.సాంబరను ప్రశ్నించారు. విద్యార్థుల హాజరు, కొత్త అడ్మిషన్లపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఒక్క అడ్మిషన్ కూడా ఎందుకు చేయలేదు..

వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాలను పాలకొండ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి సోమవారం సందర్శించారు. 6వ తరగతి అడ్మిషన్లపై ఆరాతీశారు. ఒక్క అడ్మిషన్ కూడా అవ్వలేదని గుర్తించి ఉపాధ్యాయుల పనితీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించి ఉంటే అడ్మిషన్లు అయ్యేవని, అడ్మిషన్ల కోసం స్కూల్ క్యాంపెయిన్ ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు కృషిచేయాలని సూచించారు.

వంట ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయండి

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాలను వండిపెడుతున్న వంటి ఏజెన్సీ మహిళలు సమన్వయంతో పనిచేయాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో వంట ఏజెన్సీల మధ్య చోటుచేసుకున్న వివాదంపై హెచ్‌ఎం యు.భాస్కరరావు వద్ద ఆరా తీశారు. వంట ఏజెన్సీ మహిళలను పిలిపించి వారితో మాట్లాడారు. రెండు గ్రూపులకు చెందిన మహిళలు సంయుక్తంగా వంటలు చేయాలని, విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు.

సాగునీటి సమస్యలపై దృష్టిపెట్టాలి



మల్లివీడు వద్ద తోటపల్లి ఎడమకాలువ పరిస్థితిని తెలుసుకుంటున్న రైతు నాయకులు

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాటునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. మండలంలోని మల్లివీడు గ్రామాన్ని సోమవారం సందర్శించారు. రైతులతో మాట్లాడి తోటపల్లి ఎడమ కాలువ తాజా పరిస్థితిపై ఆరాతీశారు. గతంలో ఈ కాలువకు పడిన గండి తక్షణమే పూడ్చాలని, బలహీనపడిన కాలువ గట్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా తోటపల్లి బ్యారేజ్ ద్వారా నీరు విడుదల చేసి చెరువులను నింపాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘాల నాయకులు పాలవలస రామినాయుడు, గురుబిల్లి అప్పలనాయుడు, గౌరీశంకరరావు తదితరులున్నారు.

ఐటీడీఏ స్పందనకు 80 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన స్పందనకు 80 వినతులు అందాయి. బీటీరోడ్డు నిర్మించాలని కోరుతూ ఎగువనల్లబొంతుకు చెందిన చిట్టిబాబు, తాగునీటి సౌకర్యం కల్పించాలని పుబ్బాడగూడకు చెందిన రామ్మూర్తి అధికారులను కోరారు. అలాగే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని నల్లబొంతుకు చెందిన చిన్నవాడు, గ్రావిటేషన్ పైపులు ఏర్పాటు చేయాలని కోరుతూ చిన్నబగ్గ కాలనీకి చెందిన సన్యాసిరావు వినతులు అందజేశారు. అదేవిధంగా రెవెన్యూ పట్టా ఇప్పించాలని కోరుతూ ఇరపాడుకు చెందిన కృష్ణ, కోళ్లఫారం షెడ్ మంజూరు చేయాలని ఉయ్యాలగూడకు చెందిన సింహాచలం, హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని భవనాపురానికి చెందిన మహాలక్ష్మి దరఖాస్తులు అందజేశారు. స్పందనలో ఏపీఓ రోషిరెడ్డి, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, జీసీసీ డీఎం సంధ్యారాణి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, పీఏఓ హరికృష్ణ, ఏపీడీ శ్రీహరి, సీడీపీఓ రంగలక్ష్మి, ట్రాన్స్‌కో ఏడీఈ తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణపై అప్రమత్తం



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

పాలకొండ: ఆస్పత్రిలో వచ్చే వ్యర్థాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ బగాది జగన్నాథరావు సూచించారు. పట్టణంలోని విజయ ప్రైవేట్ ఆస్పత్రిని సోమవారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రి నుంచి వచ్చే వ్యర్థాలను నిబంధనల మేరకు డిస్పోజ్ చేయాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. వైద్య సేవల్లో ఎటువంటి లోపాలు లేకుండా అందించాలని తెలిపారు. ఆయన వెంట ఎపిడమాలజిస్ట్ డా.నవీన్‌కుమార్, ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి వినోద్‌కుమార్ ఉన్నారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సిరికి గంగమ్మ

కొమరాడ: మండల కేంద్రమైన కొమరాడలో రైతుభరోసా కేంద్రం వద్ద సర్పంచ్ సిరికి గంగమ్మ ఆధ్వర్యంలో సోమవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా గ్రామస్థాయిలోనే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందిస్తోందన్నారు. అదేవిధంగా వైఎస్సార్ రైతుభరోసా కింద రైతులకు రూ.13500 పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గుల్లిపిల్ల చిన్నసుధ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

బలిజిపేట: వెంగాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో 99మంది చిన్నారులకు అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివగాయత్రి సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారులకు రక్తపరీక్షలు చేసి, బరువు తక్కువ ఉన్న వారిని గుర్తించి, పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలనేదానిపై సూచించారు.